సాక్షి
అనకాపల్లి
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



అంధుల జీవితాల్లో వెలుగు

ఎండాడలోని ప్రభుత్వ అంధ బాలికల **8లో** ఆశ్రమ పాఠశాలలో చదువుతోపాటు ఆటల్లోనూ చక్కని ప్రోత్సాహం అందిస్తున్నారు.



ఎరుకుమాంబకు జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకంతో పూజలు చేశారు.



బాలుడిని రక్షించిన పోలీసులు

భీమునిపట్నం: తల్లితో గొడవ పడి భీమిలి బీచ్ వద్ద బుధవారం ఆత్మహత్యకు యత్నించిన 14 ఏళ్ల బాలుడిని లైఫ్ గార్డులు రక్షించారు.

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కామర్స్, ఎకనామిక్స్, లైబ్రేరియన్ సబ్జెక్టులు బోధించే గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్.రాజు తెలిపారు. ఎకనామిక్స్-1, లైబ్రేరియన్-1, కామర్స్-3 పోస్టులు ఉన్నాయన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఎన్‌ఈటీ, ఎస్‌ఎల్‌ఈటీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందించాలన్నారు. ఇంటర్వ్యూలు 20వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు.

పీజీలో ప్రవేశాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులలో మిగిలి ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంకామ్‌లో 40, ఎమ్మెస్సీలో 20 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా 20వ తేదీలోగా రిజిస్ట్రేషన్, 22 లోగా సర్టిఫికేట్ల వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీలోగా వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలన్నారు.

స్వల్పంగా పెరుగుతున్న కోనాం నీటిమట్టం



కోనాం జలాశయం

చీడికాడ: మండలంలో కోనాం జలాశయం నీటిమట్టం స్వల్పంగా పెరుగుతోంది. జలాశయం పైనగల అల్లూరి సీతారామరాజు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలోకి ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో జలాశయం నీటిమట్టం 94.20 మీటర్లకు చేరింది.జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు.ఇన్‌ఫ్లో 150 క్యూసెక్కులుకాగా, ప్రస్తుతం జలాశయం నుంచి ఎగువ, దిగువ కాలువలకు 80 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. గత ఏడాది ఇదే నెలలో జలాశయం నీటి మట్టం 98.80 మీటర్లు. జలాశయం పరిధిలో మంగళవారం 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇద్దరు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల సస్పెన్షన్

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దిబ్బపాలెం సచివాలయం పరిధిలో పనిచేస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పి.వెంకటలక్ష్మి, జి.రాజేశ్వరిలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తప్పుడు వివాహ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి వీరిపై ఆరోపణలు వచ్చాయి. జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్వహించిన దర్యాప్తులో పత్రాల జారీలో వీరిద్దరి పాత్ర ఉన్నట్టు తేలడంతో సస్పెండ్ చేసినట్టు తెలిసింది. సస్పెన్షన్ అమల్లో ఉన్నంత కాలం ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వీడి ఎక్కడికీ వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే డిజిటల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

నేడు సీపీగా రవిశంకర్ అయ్యనార్ బాధ్యతలు



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: విశాఖ పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు సీపీగా విధులు నిర్వర్తించిన డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) ఐజీగా ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన, ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషినల్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న రవిశంకర్‌ను విశాఖ సీపీగా నియమించింది. అడిషినల్ డైరెక్టర్ జనరల్ హోదా అధికారిని విశాఖ పోలీస్ కమిషనర్‌గా నియమించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. విశాఖ పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో ఏడీజీ స్థాయి అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. అలాగే నూతన డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా కంచి శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

జిల్లాలో రెండు ప్రయోగ శాలలు..

ఆక్వాకు ఆసరా

చేపలు, రొయ్యల పెంపకం.. గతంలో కేవలం మత్స్యకారులకే పరిమితం. ప్రస్తుతం ఆక్వా కల్చర్‌పై రైతులు, యువత దృష్టి సారిస్తున్నారు. దీనికి ప్రభుత్వం కూడా ప్రోత్సాహమందిస్తోంది. వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో ఆక్వా కల్చర్ ప్రయోగశాలల్ని ఏర్పాటు చేసింది. వీటి ద్వారా నీరు, మట్టి నాణ్యత, రైతులు చెరువుల్లో పెంచే రొయ్యలు, చేప పిల్లల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తోంది. ఆక్వా పరిశ్రమ వైపు మరింత మంది దృష్టిసారించేలా చేస్తోంది.

- మత్స్య పరిశ్రమకు ప్రోత్సాహం
- అందుబాటులో ఆక్వా ల్యాబ్‌లు
- పరీక్షల కోసం పక్క జిల్లాలకు వెళ్లనక్కర్లేదు
- పాయకరావుపేట, యలమంచిలిలో అందుబాటులోకి

పాయకరావుపేట: జిల్లా ఆక్వా రైతుల మత్స్యసాగులో సాంకేతిక సాయం, మట్టి, నీటి నాణ్యత, చేపలు, రొయ్యల టెస్టింగ్ చేయించాలంటే ఇప్పటి వరకు కాకినాడ, భీమిలి వెళ్లాల్సి వచ్చేది. ఇపుడా చింత లేదు. రెండు మాసాల కిందట పాయకరావుపేట, యలమంచిలిలో నెలకొల్పిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో తాజాగా ఆక్వా కల్చర్ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. దీంతో పక్క జిల్లాలకు వెళ్లే



ల్యాబ్‌లో ఆక్వా రైతుల కోసం నీటి నాణ్యతను పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో శృతి



పాయకరావుపేటలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

వారు, ఆ శ్రమ ఎందుకులే అని పరీక్షల జోలికి వెళ్లని వారంతా ఈ ల్యాబ్ అందుబాటులోకి రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రెండు చోట్ల ఏర్పాటు

జిల్లాలో యలమంచిలి, పాయకరావుపేట పట్టణాల్లో ఇంటిగ్రేటెడ్ టెస్టింగ్ ల్యాబ్స్ వున్నాయి. అక్కడ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లతో పాటు ఆక్వా కల్చర్ ప్రయోగశాల కూడా నడుస్తోంది. ఒక్కో దానికి సుమారు రూ.80 లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ, నాబార్డ్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్కేవీవై) నిధులు వెచ్చించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కాకినాడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఎస్‌ఐఎఫ్‌టీ) పర్యవేక్షణలో ఈ ల్యాబ్‌లు పనిచేస్తాయి. ఇక్కడి సిబ్బందికి ఎస్‌ఐఎఫ్‌టీ నుంచి వచ్చి తగు శిక్షణ అందించారు. వీటిని ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే దాదాపు 50 మంది ఆక్వా రైతులు వివిధ పరీక్షలు నిర్వహించడంతోపాటు, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పాయకరావుపేట ల్యాబ్‌లో పాయకరావుపేట, నక్కపల్లికి చెందిన చేపలు, రొయ్యల పెంపకందార్లు నీటి నాణ్యత, రొయ్యలు, చేపల ఆరోగ్యంపై పరీక్షలు చేయించారు. అధికారుల సూచనల మేరకు సాగులో జాగ్రత్తలు తీసుకున్నారు.

ఆక్వా పరిశ్రమకు మంచి రోజులు

పాయకరావుపేట మండలంలో 225 ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. నక్కపల్లి మండలంలో మరో 115 ఎకరాల్లో రొయ్యలు, చేపల పెంపకం జరుగుతోంది. పాయకరావుపేట మండలంలో సముద్రతీరం వెంబడి 24 హేచరీలు వున్నాయి. ఆక్వా టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు వీటన్నింటికీ ఎంతగానో ఉపయోగపడుతోంది. మట్టి, నీరు, రొయ్యలు, చేపలపై పరీక్షలతోపాటు, హేచరీల



నిర్వహణ యాజమాన్యంపై కూడా తగు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. కాకినాడ నుంచి వచ్చే నిపుణులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాల ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నారు. ఆక్వా సాగుకు అనువైన ప్రాంతం, నీటి నాణ్యత, చేపలు, రొయ్యల్లో సీజన్ల వారీగా వచ్చే రోగాలపై ఎప్పటికప్పుడు ల్యాబ్ సిబ్బంది సలహాలు అందిస్తూ సాయపడుతున్నట్లు స్థానిక ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శృతి(ఎఫ్‌డీవో) సాక్షికి తెలిపారు. ఇప్పటి వరకు పాయకరావుపేటలో 25 మంది, యలమంచిలిలో 25 మంది రైతులు వివిధ నమూనాలను తీసుకొచ్చి, పరీక్షించుకుని, తగు సూచనలు పొందినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం భేష్



స్థానికంగా ఆక్వా కల్చర్ ప్రయోగశాల ఏర్పాటు వలన చుట్టుపక్కల ఆక్వా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇదివరకు ఈ పరీక్షల కోసం కాకినాడ, భీమిలి వెళ్లేవాళ్లం. ఇపుడు అనకాపల్లి జిల్లాలోనే రెండుచోట్ల ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఆక్వా రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోంది. కరెంటు రాయితీ ఇవ్వడంతోపాటు, నాణ్యమైన సీడ్ కూడా సమకూరుస్తోంది.

–చోడిపల్లి శ్రీనివాసరావు, ఆక్వా రైతు, వెంకటనగరం, పాయకరావుపేట

సీటీ స్కాన్.. డయాలసిస్ యూనిట్

- ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో త్వరలో ఏర్పాటు
- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి వెల్లడి



రోగులతో మాట్లాడుతున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ వైద్యాలయంలో కిడ్నీ రోగుల కోసం ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న డయాలసిస్ యూనిట్‌ను త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి చెప్పారు. బుధవారం వైద్యాలయంలో వివిధ విభాగాలను ఆయన పరిశీలించి అక్కడ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వైద్యాలయంలో సీటీ స్కాన్ మిషన్ కోసం అదానీ గ్రూప్ యాజమాన్యంతో చర్చించారని, వారి సీఎస్సార్ నిధుల నుంచి రూ.2 కోట్లతో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన మిషన్ త్వరలో ఏర్పాటు చేస్తారని తెలిపారు. రూ.22 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ కూడా త్వరలో ప్రారంభమవుతుందని, ఈ యూనిట్ వలన అన్ని ప్రమాదకరమైన, అత్యవసర కేసులన్నింటికీ ఇక్కడే వైద్యం అందించే అవకాశం కలుగుతుందన్నారు. డీసీహెచ్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎం.శ్రీనివాసరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఇంటింటికీ ఆరోగ్య భాగ్యం



జగనన్న ఆరోగ్య సురక్ష వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- రేపటి నుంచి ప్రజల ఆరోగ్య సమాచారం సేకరణ
- అనారోగ్యంతో బాధ పడుతున్న వారి వివరాల అప్‌లోడ్
- 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ఏడు రకాల వైద్య పరీక్షలు
- రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం

తుమ్మపాల: ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితోపాటు ఎంపీ పాల్గొన్నారు. కార్యక్రమం విధివిధానాలపై ముఖ్యమంత్రి సందేశం అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యిందని, ప్రజలు పూర్తిస్థాయిలో సేవలు పొందారన్నారు. అదే తరహాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతున్నారన్నారు. వైద్య శాఖ, సచివాలయ సిబ్బందితో పాటు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు ఈ నెల 15 నుంచి ఇంటింటా సర్వే చేసి పూర్తి ఆరోగ్య సమాచారం సేకరించాలన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 16వ తేదీ నుంచి ఏఎన్ఎం, సీహెచ్‌వో, ఆశా వర్కర్లు అనారోగ్యంతో బాధ పడుతున్న వారి వివరాలను వైద్య ఆరోగ్య శాఖ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందించే సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన గ్రామ, మండల స్థాయిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పాఠశాలల్లో నిర్వహించేందుకు ఎంపీడీవోలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించే తేదీకి మూడు రోజుల ముందుగానే వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సమాచారం అందించాలన్నారు. వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. 45 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, డీఎంహెచ్‌వో హేమంత్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

ఉపాధ్యాయులతో డీఈవో వెంకటలక్ష్మమ్మ సమావేశం



సైన్స్ ఫేర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లిటౌన్: విద్యార్థులకు సైన్స్ పట్ల అభిరుచిని, ఆసక్తిని పెంపొందించి, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో జిల్లా విద్యాశాఖ, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2023పై ఉపాధ్యాయుల అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 31వ జాతీయ సైన్స్ కాంగ్రెస్ ప్రధానాంశం ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణాన్ని అర్థం చేసుకోవడంపై ఐదు ఉప అంశాల్లో ఎలాంటి ప్రాజెక్టులు చేపట్టవచ్చో వివరించారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల పాజిటివ్ దృక్పథాన్ని పెంచేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషిచేసే సామర్థ్యం పెంచుకుని, తద్వారా సమాజానికి ప్రయోజనం చేకూర్చేందుకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఒక ప్రత్యేక వేదికగా ఏర్పడిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పిల్లల్లో శాస్త్ర, సాంకేతిక అంశాలపై అభిరుచి, ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేసి, మంచి ప్రాజెక్టులు రూపొందించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్‌కాస్ట్) జిల్లా సమన్వయకర్త పి.రాజారావు మాట్లాడుతూ గత ఏడాది మాదిరే, ఈసారి కూడా ప్రధానాంశం, ఉప అంశాలు అవే ఉంటాయన్నారు. డీఈవో ఆదేశాల మేరకు ప్రతి హైస్కూల్ నుంచి రెండు ప్రాజెక్టులు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఒక ప్రాజెక్టు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. అక్టోబర్ రెండు లేదా మూడో వారంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు సైన్స్ ఫేర్ గోడపత్రికలను డీఈవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రుధిరారాణి, రిసోర్స్‌పర్సన్లు వి.వి.గిరి, బి.సుజాత, రాజగోపాల్, బి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.

యూపీ యువకుల అనుమానాస్పద సంచారం

- కారుచౌకగా మిక్సీలు అమ్ముతామంటూ ప్రచారం
- పిల్లలకు చాక్లెట్లు ఎర చూపడంతో దిమిలిలో భయాందోళన
- పోలీసులకు స్థానికుల ఫిర్యాదు

రాంబిల్లి: దిమిలిలో బుధవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకులు అనుమానాస్పదంగా సంచరించడం కలకలం రేపింది. కారుచౌకగా మిక్సీలు అమ్ముతామంటూ వారు వీధుల్లోనూ, సందుల్లోనూ కలియదిరిగారు. మధ్యాహ్న సమయంలో చాక్లెట్లు ఇస్తామని చెప్పి దగ్గరకు తీయడంతో భయంతో చిన్నారులు పరుగులు తీశారు. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ వార్త గ్రామంలో గుప్పుమని వ్యాపించింది. సమాచారం తెలుసుకున్న మహిళా పోలీసు వెంకటలక్ష్మి షాహిజన్, ఆసిఫ్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని ఎస్ఐ దీనబంధుకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఆదేశాల మేరకు ఏఎస్ఐ దొర దిమిలి చేరుకొని ఈ ఇద్దరు యువకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ యువకులు అనుమానం రాకుండా వీధివీధికి షర్టులు మార్చినట్లు గ్రామస్తులు తెలిపారు. వీరు కాకుండా మరికొంత మంది ముఠా తిరుగుతోందని, వీరిని సమగ్రంగా విచారించాలని వారు కోరారు. అయితే వారి గురించి విచారించగా.. విశాఖ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక లాడ్జిలో వారు బస చేశారని, నేర చరిత్ర లేదని తెలిసింది. దీంతో వారిని విడిచిపెట్టామని, అయినా వారిపై నిఘా పెడతామని పోలీసులు చెప్పారు.



యువకులను పట్టుకున్న గ్రామస్తులు

అల్లూరి పోరాటంపై పరిశోధన

మన్యం వీరుడి సమాధిని సందర్శించిన గుజరాత్ అధ్యయన బృందం



కృష్ణదేవిపేట పార్కులో ఉన్న అల్లూరి, గంటందొర సమాధులకు నివాళులర్పిస్తున్న సభ్యులు

గొలుగొండ: గుజరాత్ రాష్ట్రం నుంచి అధ్యయన బృందం సభ్యులు బుధవారం సాయంత్రం కృష్ణదేవిపేటలోని అల్లూరి పార్కును సందర్శించారు. సీతారామరాజు, గంటందొర సమాధులకు నివాళులర్పించారు. మన్యం ప్రాంతంలో అల్లూరి, ఇతర సమరయోధుల పోరాటాలు, వాటి చరిత్రపై పరిశోధనలు చేస్తున్నట్లు చెప్పారు. మంప, కృష్ణదేవిపేటతో పాటు ఇతర ప్రాంతాల్లో అధ్యయనం చేసి గుజరాత్‌లో ఏర్పాటు చేసే మ్యూజియంలో వీటిని పొందుపరుస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ముర్గి, పాటిల్, మనోజ్, రమణి, రాహుల్‌తోపాటు ఏపీ పరిశోధన సంస్థ సభ్యులు శంకర్రావు, సీతారామయ్య తదితర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వుడ్ పోలీస్ మైదానంలో ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన పరీక్షలకు 800 మందికి హాల్ టికెట్లు పంపగా.. 668 మంది అభ్యర్థులు హాజరయ్యారు. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షణలో అధికారులు వీరికి పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు ఏయూలో జాబ్‌మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. డెక్కన్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ట్రైనీ కెమిస్ట్ విభాగంలో 250, జూనియర్ కెమిస్ట్ విభాగంలో 100 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రైనీ కెమిస్ట్‌కు 27 సంవత్సరాలలోపు వయసు గలవారు అర్హులని, నెలకు వేతనం రూ.19,744 ఉంటుందని తెలిపారు. జూనియర్ కెమిస్ట్‌కు 30 ఏళ్ల లోపు వయసు గలవారు దరఖాస్తు చేసుకోవాలని, వార్షిక వేతనం ఏడాదికి రూ 3.5 లక్షలు అందిస్తారని తెలియజేశారు. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్‌లో అసోసియేట్ ఆపరేషన్స్ ఉద్యోగానికి టైప్ రైటింగ్‌లో నిమిషానికి 28 పదాలు టైప్ చేయగలిగి, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. మొత్తం 258 ఖాళీలు భర్తీ చేస్తామని, 20 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు అర్హులని, వీరికి నెలకు వేతనంగా రూ.15 వేలు అందిస్తారని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను ncs. gov. in లో నమోదు చేసుకోవాలని, ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. అవసరమయిన సర్టిఫికెట్లు తెచ్చుకోవాలన్నారు. ఇతర వివరాలకు 96660 92491 నంబరులో సంప్రదించాలని వివరించారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

శిబిరం చిరునామా
డాక్టర్ హిమశేఖర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
సత్తెమ్మతల్లి ఆలయం రోడ్డు, గవరపాలెం, అనకాపల్లి
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబర్లు :
90101 06665, 70757 09205

వసతి గృహాల అభివృద్ధికి రూ.68 లక్షలు



ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వసతి గృహాల సంక్షేమ అధికారులకు నిధుల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకటసత్యవతి

ఎంపీ సత్యవతి

కశింకోట: నియోజకవర్గంలోని వసతి గృహాల అభివృద్ధికి ఎంపీ కోటా నిధులు రూ.68 లక్షలు మంజూరు చేసినట్టు ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకటసత్యవతి బుధవారం తెలిపారు. మంజూరు చేసిన నిధుల్లో అనకాపల్లి బాలుర బీసీ హాస్టల్‌కు రూ.15 లక్షలు, ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్ స్టడీ హాల్, భవనం మరమ్మతులకు రూ.20 లక్షలు, కశింకోట బీసీ బాలుర హాస్టల్ మరుగుదొడ్ల బ్లాక్, ఇతర మరమ్మతులకు రూ.15 లక్షలు, బీసీ బాలికల హాస్టల్ అభివృద్ధికి రూ.11 లక్షలు, గోవాడ ఎస్టీ బాలుర కాలేజీ హాస్టల్ మరమ్మతులకు రూ.7 లక్షలు చొప్పున విడుదల చేసినట్టు చెప్పారు. ఈ మేరకు అనకాపల్లి క్యాంపు కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ డీడీ రాజేశ్వరి, ఎస్సీ జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి అజయ్‌బాబు, ఎస్టీ జిల్లా సంక్షేమ అధికారి వి.నాగ శిరీషలకు మంజూరు పత్రాలను ఎంపీ సత్యవతి అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సత్యనారాయణ, రామయ్య, పి. నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో రైతు దారుణ హత్య

- డబ్బు కోసమే చంపేశారని అనుమానం
- ఉలిక్కి పడిన ఉపమాక



రక్తపు మడుగులో మృతుడు సత్యనారాయణ

నక్కపల్లి: మండలంలో ఉపమాక, ఎన్. నర్సాపురం గ్రామాల మధ్యన పొలంలో నివసిస్తున్న రైతు బుధవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. అతని వద్ద డబ్బుల కోసమే గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనతో ఉపమాక ఒక్కసారిగా ఉలిక్కి పడింది. వివరాల్లోకి వెళ్తే.. ఉపమాక గ్రామానికి చెందిన పాశిన సత్యనారాయణ(59) నర్సాపురం సమీపంలోని మామిడి తోటలో భార్య సత్తెమ్మతో కలసి కాపురం ఉంటున్నాడు. వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇతని భార్య కల్లు విక్రయిస్తోంది. వీరి నివాసం ఉంటున్న ఇంటికి సమీపంలో కోనవానిపాలెం వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇతని తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మరణించాడు. భర్త ఎంతకీ రాకపోవడంతో ఆమె అతని కోసం కోనవానిపాలెం వెపు వెళ్లి పరిశీలించగా, ఇంటికి సమీపంలో రోడ్డు పక్కన రక్తపు మడుగులో పడి ఉండటం చూసి బోరున విలపిస్తూ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వద్ద ఎక్కువ మొత్తంలో నగదు ఉంటుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నగదు కోసమే గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని భార్య, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శిరీష సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి చుట్టు పక్కల వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. మృతుడికి ఇద్దరేసి కుమారులు, కుమార్తెలు ఉన్నారు. వీరికి వివాహాలయ్యాయి.

వారే లక్ష్యంగా..

ఇటీవల కాలంలో గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు హల్‌చల్ చేస్తున్నారు. ఒంటరి మహిళలు, బైక్‌లపై వెళ్లేవారిని టార్గెట్ చేస్తున్నారు. ఇళ్ల ముందు పార్కు చేసిన బైక్‌లు చోరీ చేస్తున్నారు. పట్టణాల నుంచి పల్లెలకు బైక్‌లు, పాదచారులు, సైకిల్‌పై వెళ్లే వారిని టార్గెట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లో నివసిస్తున్న వ్యక్తిని హత్య చేసిన విషయాన్ని తెలుసుకుని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో రిపోర్టర్ల నవీకరణ

- సామాజిక మాధ్యమాల్లో పోటీతత్వం పెరగాలి
- విలేకరుల శిక్షణలో ఎస్పీ మురళీకృష్ణ



ఎస్పీ మురళీకృష్ణను సన్మానిస్తున్న పీఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హల్లి కేరి, పీఐబీ మీడియా కమ్యూనికేషన్ అధికారి హెన్రీరాజ్

తుమ్మపాల: రిపోర్టర్లు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ తమను తాము నవీకరించుకోవాలని ఎస్పీ కె.వి. మురళీకృష్ణ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లోనూ పోటీతత్వం పెరగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ పత్రికా సమాచార బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో బుధవారం అనకాపల్లి టౌన్‌లోని ఒక హోటల్‌లో విలేకరుల శిక్షణ (వార్తాలాప్) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పత్రికలతో పాటు మారుతున్న సమాచార వ్యవస్థ కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. సమాచార వ్యవస్థ అనేది సమాజాన్ని మంచి మార్గం వైపు.. ఆధునికత వైపు పయనింపజేస్తుందన్నారు. ఇటీవల కాలంలో సమాచార వ్యవస్థ వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లను ఉపయోగించుకుని మరింత విస్తృతమైందని చెప్పారు. పత్రికలు అనైతిక, తప్పుడు వార్తలను గుర్తించి స్పష్టమైన, సత్య సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు. పత్రికలు లేదా ఇతర సమాచార వ్యవస్థల ద్వారా వచ్చే సమాచారం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేంద్ర సమాచార బ్యూరో జాయింట్ డైరెక్టర్ పి. రత్నాకర్ మాట్లాడుతూ తమ సంస్థ ప్రజలకు అందించే సమాచారం, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గురించి వివరించారు. విపత్తుల సమయంలో అసత్య సమాచారం వ్యాప్తి చెందకుండా వాస్తవ సమాచారం తమ శాఖ ద్వారా అందిస్తున్నామన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్ఎస్ఐ.ఇన్. వెబ్‌సైట్ ద్వారా పార్లమెంట్, కేంద్ర ప్రభుత్వ వార్తలను, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇతర మంత్రులు పాల్గొన్న కార్యక్రమాలను మీడియా వారికి అందిస్తామన్నారు. వ్యాధులు, ప్రమాదాలకు గురైన పాత్రికేయులకు కేంద్ర ప్రభుత్వం రూ. లక్ష నుంచి రూ.5 సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హల్లి కేరి, పీఐబీ మీడియా కమ్యూనికేషన్ అధికారి టి. హెన్రీరాజ్, డీపీఆర్వో డి.సాయిబాబా, జిల్లాలోని పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి సహకరిస్తా

యాత కార్పొరేషన్ స్టేట్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత



ఆలయంలో పూజలు చేస్తున్న యాత కార్పొరేషన్ స్టేట్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

రోలుగుంట: మాస శివరాత్రి సందర్భంగా స్థానిక విశాలాక్షి కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయాన్ని యాత కార్పొరేషన్ స్టేట్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత బుధవారం దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పి.చిన్నారావును ఆలయ అభివృద్ధి, విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయాభివృద్ధితోపాటు భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన కోసం తనవంతు సాయం అందిస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కమిటీ సభ్యులు పిల్లి శ్రీను, రోజా తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శన



ఇస్రో రాకెట్‌ను పరిశీలిస్తున్న మార్టూరు హైస్కూల్ విద్యార్థులు

అనకాపల్లి టౌన్: మండలంలో మార్టూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 9,10 తరగతుల విద్యార్థులు తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని సందర్శించినట్టు ఉపాధ్యాయులు మారిశెట్టి శివరామకృష్ణ, నూకేష్, గోపాలకృష్ణ, రాజకుమారి తెలిపారు. సోమవారం అనకాపల్లి నుంచి 38 మంది విద్యార్థులు వెళ్లారని, అక్కడ వివిధ విభాగాలను పరిశీలించి బుధవారం తిరిగి అనకాపల్లి చేరుకున్నారని చెప్పారు. ఈ పర్యటనలో మ్యూజియం, రాకెట్ ప్రయోగ కేంద్రాలు, మిషన్ కంట్రోల్ సెంటర్‌లను విద్యార్థులు తిలకించినట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం కె.విజయ,స్కూల్ కమిటీ చైర్మన్ ప్రకాశరావు, ఇస్రో ఉద్యోగి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

22-ఏలో నమోదైన భూ సమస్యపై సర్వే చేస్తాం

తాండవ, చమ్మచింతలో
జిల్లా సర్వేయరు గోపాలరావు పరిశీలన



చమ్మచింతలో 22ఏలో నమోదైన భూములను పరిశీలిస్తున్న జిల్లా సర్వేయరు గోపాలరావు

నాతవరం: సాంకేతిక సమస్యతో ప్రభుత్వ భూమిగా (22ఏ)గా నమోదైన జిరాయితీ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా సర్వేయరు ఎస్.గోపాలరావు తెలిపారు. ఆయన బుధవారం నర్సీపట్నం డివిజనల్ సర్వేయరు బంగారుదేవితో కలిసి మండలంలో 22ఏకు సంబంధించి భూమి రికార్డులు తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడును అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 8న నాతవరంలో కలెక్టరు ఆధ్వర్యంలో నిర్వహించిన (స్పందన) జగనన్నకు చెబుదాంలో అధిక శాతం జిరాయితీ భూములు 22ఏలో నమోదైనట్లుగా ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తోపాటు సర్పంచులు ఎంపీటీసీలు ఫిర్యాదు చేశారు. మండలంలో తాండవ ఏలేరు కాలువలకు ఆనుకున్న జిరాయితీ భూములు 22ఏలో నమోదయ్యాయని అందులో పేర్కొన్నారు. దీనిపై కలెక్టరు రవిపట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టరు జాహ్నవి ప్రత్యేక దృష్టి సారించి సమస్య జిల్లా సర్వేయరుకు అప్పగించారు. ఈ మేరకు ముందుగా రికార్డులు, మండల స్వరూపాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. 1/70 యాక్టు పరిధిలోని తాండవ, చమ్మచింత ప్రాంతంలో భూములను పరిశీలించి చమ్మచింత సచివాలయాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. మండలంలో సచివాలయాల వారీగా సర్వే చేయాల్సిందన్నారు. మండలాన్ని సర్వే చేసేందుకు రెవెన్యూ, వ్యవసాయ, రిజిస్ట్రేషన్ శాఖలను ఒక కమిటీగా ఏర్పాటు చేశారన్నారు. ఏ విధంగా సర్వే చేయాలనే అంశాలపై కలెక్టరు, జేసీలకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్లు కె.వేణుగోపాలరావు, మండల సర్వేయరు బాలరెడ్డి, సచివాలయ సర్వేయర్లు విజయకుమార్, అశోక్, జగదీష్ సిబ్బంది పాల్గొన్నారు.

జాబితా నుంచి వుడా లే అవుట్ తొలగింపు

దొండపర్తి (విశాఖ): అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో సర్వే నంబర్ 388/1లో 22.38 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించినట్లు మెట్రోపాలిటన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూమిని కొత్తూరు శ్రీ సత్య నారాయణ స్వామి దేవస్థానం నుంచి 1993లో వుడా కొనుగోలు చేసి అందులో 12 ఎకరాల్లో లే అవుట్ వేసి ప్లాట్లను కేటాయించినట్లు వెల్లడించారు. అయితే ఆ సర్వే నంబర్‌ను దేవదాయ శాఖ అధికారులు పొరపాటున 22ఏ జాబితాలో నోటిఫై చేయడంతో సదరు ప్లాట్లను కొనుగోలు చేసిన వారు క్రయవిక్రయాలకు ఇబ్బందులు పడినట్లు చెప్పారు. దీనిపై దేవదాయ శాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేయగా.. ఆ సర్వే నంబర్‌ను 22ఏ నిషిద్ధ జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. ఈ విషయాన్ని సంబంధిత ప్లాట్ల యాజమానులు గమనించాలని సూచించారు. అలాగే ఆ సర్వే నంబర్‌లో మిగిలిన 10 ఎకరాలను వీఎంఆర్‌డీఏ త్వరలో ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఎదురెదురుగా వచ్చి ద్విచక్ర వాహనాలు ఢీ

జేవీపాలెంలో యువకుడి మృతి



అయ్యప్ప స్వామి మృతదేహం

ఎస్.రాయవరం: ఎదురెదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాలు ఢీకొట్టి యువకుడు మృతి చెందినట్టు ఎస్సై ప్రసాదరావు బుధవారం తెలిపారు. మండలంలోని ఉప్పరాపల్లి గ్రామానికి చెందిన ఉప్పలపు అయ్యప్ప స్వామి(36) మంగళవారం తన స్వగ్రామానికి వస్తుండగా, ఎస్.రాయవరం నుంచి యలమంచిలి వెళ్తున్న మరో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం జేవీ పాలెం ఆర్అండ్‌బీ రోడ్డుపై మలుపు వద్ద ఢీకొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడని చెప్పారు. ముందుగా యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి, ఆ తర్వాత అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించామన్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు చెప్పారు. కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

భారీ లోడు లారీలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న భారీ వాహనాలు

మునగపాక: భారీ లోడులతో వెళ్తున్న నాలుగు లారీలను మునగపాక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద పరిమితికి మించి లోడుతో వెళ్లడాన్ని గుర్తించి సంబంధిత వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగించడం ద్వారా వాహనచోదకులు ఇబ్బందులు పడటంతో మంగళవారం అర్ధరాత్రి దాడులు చేశారు. ఈ దాడిలో నాలుగు లారీలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మహమ్మద్ ఆలీ తెలిపారు.

విద్యార్థులకు స్టాంప్ కలెక్షన్ స్కాలర్‌షిప్

మహారాణిపేట: తపాలాబిళ్లలు సేకరించే విద్యార్థులకు కేంద్రప్రభుత్వం ఇస్తున్న స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులని పేర్కొన్నారు. పాఠశాలలో ఫిలాటెలీ క్లబ్ ఏర్పాటై, ఆ విద్యార్థి అందులో సభ్యుడై ఉండాలని, పాఠశాలలో క్లబ్ లేకపోతే విద్యార్థి వ్యక్తిగత ఫిలాటెలీ డిపాజిట్ అకౌంట్ కలిగి ఉండాలని సూచించారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన వారికి నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6వేలు ఒక సంవత్సరం ఇస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుల కోసం సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 20వ తేదీలోగా ఫిలాటెలీ స్టాంప్ జత చేసి స్పీడ్‌పోస్ట్ ద్వారా పోస్ట్ మాస్టర్ జనరల్, విశాఖ రీజియన్, ఎంపీవీ కాలనీ చిరునామాకు పంపించాలని వివరించారు.

అంధుల జీవితాల్లో వెలుగు దివ్వె

పుట్టుకతో కొందరు.. విధి వైపరీత్యంతో మరికొందరు.. మేనరికపు పెళ్లిళ్లతో కలిగే జన్యుపరమైన సమస్యలతో ఇంకొందరు.. కారణాలేమైనా ఇక్కడ చదువుతున్న బాలికలకు కంటి చూపులేదు. కానీ ప్రభుత్వం కల్పించిన వనరులను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో ముందుకు సాగుతున్నారు. మనోనేత్రంతో బాహ్య ప్రపంచాన్ని చూస్తూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ తామెవ్వరికీ తీసిపోమని చాటి చెబుతున్నారు. వీరే బీచ్‌రోడ్డు(ఎండాడ)లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు.

– విశాఖ విద్య



టాయ్‌లర్ ఫ్రేమ్‌పై గణిత పాఠ్యాంశాలను బోధిస్తున్న ఉపాధ్యాయిని

- ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల
- చదువుతో పాటు ఆటల్లోనూ ప్రోత్సాహం
- అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో ఆడిన పూర్వ విద్యార్థిని
- అధునాతన బోధనోపకరణాలతో విద్య
- రాష్ట్రంలోని అంధ బాలికలకు అడ్మిషన్లు

విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంధ విద్యార్థుల కోసం విశాఖపట్నం, విజయనగరం, హిందూపూర్‌లో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. బీచ్‌రోడ్(ఎండాడ)లోని 3 ఎకరాల విస్తీర్ణంలో 1987లో ఈ పాఠశాల ఏర్పాటు చేయగా.. ఇక్కడ బాలికలకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు గల 40 శాతంకు పైగా అంధత్వం కలిగిన వారు ఇక్కడ చేరేందుకు అర్హులు. 1 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించే ఈ పాఠశాలలో 100 మంది ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉంది. ప్రస్తుతం 60 మంది బాలికలు చదువుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వసతులు

అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికలకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఇచ్చే యూనిఫాంతో పాటు జగనన్న విద్యాకానుక వీరికి అందిస్తున్నారు. నాడు–నేడు రెండో దశ కింద ప్రభుత్వం రూ.27లక్షలు మంజూరు చేయగా.. ఈ నిధులతో పాఠశాల, విద్యార్థినుల అవసరాల మేరకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు.

పది ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత

ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌తో ప్రభుత్వం బ్రెయిలీ లిపితో ముద్రించిన పుస్తకాలను వినియోగిస్తూనే.. అధునాతన పరికరాలతో ఇక్కడి ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. నాన్ వెర్బల్ డెస్క్‌టాప్ అసిస్టెంట్(ఎన్‌వీడీఏ) విధానం ద్వారా కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే శబ్దాలను అనుసరించి కంప్యూటర్లతో సరికొత్త పాఠ్యాంశాలను నేర్చుకుంటున్నారు.



విద్యార్థినులకు చెస్ నేర్పుతున్న పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్

డైజీ ప్లేయర్‌లో రికార్డు చేసిన పాఠ్యాంశాలను వింటూ చదువుల్లో ముందుకెళ్తున్నారు. బ్రెయిలీ లిపితో నిక్షిప్తం చేసిన 'అని సిస్టమ్స్'(డీవీస్ సంస్థ స్పాన్సర్) విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇక్కడి విద్యార్థినులు గత కొన్నేళ్లుగా పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధిస్తున్నారు.

ఆటల్లోనూ మేటి

ఇక్కడి విద్యార్థినులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. ఎం.సత్యవతి అనే పూర్వ విద్యార్థిని ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించింది. పాఠశాలల్లో వ్యాయామ విద్యకు ప్రాధాన్యం ఇస్తుండటంతో బాలికలు చెస్, వెయిట్ లిఫ్టింగ్ తదితర పోటీల్లోనూ తమ సత్తా చాటుతున్నారు.

గతంలో కన్నా మార్పు



15 ఏళ్లుగా ఇక్కడే పని చేస్తున్నాను. కంటి చూపు లేదని కుంగిపోకుండా.. మనో ధైర్యంతో అవకాశాలు అందిపుచ్చుకోవాలని విద్యార్థినుల్లో ప్రేరణ కలిగిస్తున్నాం. తోటి ఉపాధ్యాయులంతా ఎంతో సహకరిస్తున్నారు. సంస్థ డైరెక్టర్ బి.రవిప్రకాశ్‌రెడ్డి చొరవతో పాఠశాలలో గతంలో కన్నా సౌకర్యాలు మెరుగయ్యాయి. ఇంకో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని ఎక్కడ వారినైనా చేర్చుకుంటాం.

–జి.తిరుమల ప్రసాద్, ప్రిన్సిపాల్, అంధ బాలికల ఆశ్రమ పాఠశాల

వారంతా మా పిల్లలే..



నాకూ కంటి చూపు లేదు. అయినా టీచర్ అయ్యాను. మీరు కూడా ప్రయోజకులు కావాలని విద్యార్థినుల్లో స్ఫూర్తి రగిలిస్తున్నాం. వారంతా మా పిల్లలాంటి వారే. ప్రభుత్వ ఆశయాల మేరకు వారి పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్నాం. వార్డెన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూనే.. ప్రైమరీ తరగతులకు బోధిస్తాను.

– ఎస్కే నూర్జహాన్, వసతి గృహాధికారి

ప్రధాని ప్రశంసలు ఆనందాన్నిచ్చాయి



హర్ ఘర్ తిరంగా వేడుక రోజు జాతీయ జెండాను పట్టుకోవడం సంతోషం కలిగించిందని మా సార్‌కు చెబితే.. నా ఫొటో తీసి దాన్ని సోషల్ మీడియాలో పెట్టారు. అది చూసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నన్ను అభినందిస్తూ ఎక్స్(ట్విట్టర్) ద్వారా ప్రశంసించారని మా సార్ చెబితే ఎంతో ఆనందం కలిగింది.

– సుగ్గు మాధురి, 10వ తరగతి

ఇష్టంతో చదువుకుంటున్నాం



పాఠశాలలో సౌకర్యాలు బాగున్నాయి. మా తల్లిదండ్రుల మాదిరే ఇక్కడి ఉపాధ్యాయులు చూసుకుంటున్నారు. అందుకే ఇష్టంతో చదువుకుంటున్నాం. లెక్కలంటే మరీ ఇష్టం. మా టీచర్ అర్థమయ్యేలా ఎంతో బాగా చెబుతారు.

– జి.ప్రవల్లిక, 9వ తరగతి

క్లుప్తంగా

రైతుల్ని గౌరవిద్దాం



విద్యార్థులతో ఆదారి కిషోర్

అనకాపల్లిటౌన్: దేశ ప్రజలకు అన్నం పెట్టే రైతులు పడుతున్న శ్రమకు తగిన ప్రతిఫలం లభించడం కోసం అందరూ అండగా నిలవాలని మిషన్ కర్షక దేవోభవ ప్రాజెక్టు జాతీయ చైర్మన్ ఆదారి కిషోర్ అన్నారు. 47వ రోజు కర్షక దేవోభవ అవగాహన సదస్సును స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ జూనియర్ కళాశాలలో బువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 400 రోజుల పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి, రికార్డు నెలకొల్పామన్నారు. రైతులకు అందుబాటులో మంచి విత్తనాలు, పంటకు తగిన గిట్టుబాటు ధర లభించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో, ఇతర వ్యవస్థల్లో రైతులకు గౌరవాన్నివ్వాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోరుబిల్లి నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అనకాపల్లిటౌన్: స్థానిక పూడిమడక రహదారిలో ఉన్న సత్యదేవ్ ఆస్పత్రిలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ బొడ్డేడ లక్ష్మీ నరసింహరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు జరిగే ఈ శిబిరంలో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్యాన్సర్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ప్రజలను కోరారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

అనకాపల్లిటౌన్: స్థానిక పాత బర్మాకాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన బండి లక్ష్మి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలును వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 15 రోజుల్లో మిగిలిన రూ.90 వేలు నగదు కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి ద్రాక్షాయిని, వైఎస్సార్‌సీపీ నాయకులు కోన ఉమ, ఈతలపాక శివ, చింతా రాంజీ, కూండ్రపు సత్తిబాబు, డొంక సత్తిబాబు, వలంటీర్ పాల్గొన్నారు.


పీఆర్టీయూ జోన్ అధ్యక్షునిగా కోరిబిల్లి

అనకాపల్లిటౌన్: పీఆర్టీయూ అనకాపల్లి జీవీఎంసీ జోన్ అధ్యక్షునిగా కోరిబిల్లి నర్సింగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా దాసరి నూకరాజు, మహిళా కార్యదర్శిగా కె.రమాదేవి, అసోసియేట్ అధ్యక్షునిగా జి.అర్జున్, మహిళా ఉపాధ్యక్షురాలిగా డి.మంగమ్మ, కార్యదర్శులుగా కె.నూకేశ్వరరావు, బీఏఎస్ కృష్ణవేణి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా దాడి అప్పలనాయుడు, కిల్లాడ రాములు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కాండ్రేగుల జనార్దనరావు, ఎన్నికల పరిశీలకునిగా ఎస్‌వీ నరసింహంలు వ్యవహరించగా, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.అప్పారావు, రాష్ట్ర కౌన్సిలర్ ఏవీ రామచంద్రరావు పాల్గొన్నారు.

ఘాట్‌ల అభివృద్ధికి వినతి

అనకాపల్లిటౌన్: స్థానిక శారదానది వద్ద వినాయక ఘాట్ అభివృద్ధి చేస్తూ, మరో రెండు నూతన ఘాట్ల నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి కోరారు. ఈ మేరకు ఎంపీ బీవీ సత్యవతికి ఆమె కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందించారు. ఏడాదిలో ఆరు మాసాలు శారదానదిలో భక్తుల సందడి ఉంటుందని, నదిలో దిగే భక్తులకు అసౌకర్యం లేకుండా ఘాట్‌లను అభివృద్ధి చేయాలని వినతి పత్రంలో కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 196 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	---	---
రెండో రకం	4,120	4,370
మూడోరకం	4,090	4,180

విస్తారంగా వర్షాలు..

జోరుగా వరినాట్లు



ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న దృశ్యం

- మండలంలో 7,300 ఎకరాల్లో వరి సాగు
- తాజా వర్షాలతో తొలగిన రైతుల బెంగ
- ఒకేసారి ఉడుపులతో కూలీల కొరత

ఈ ఏడాది వర్షాలు ఆలస్యమయ్యాయి. దీంతో నారు ఎండిపోతుందేమోనన్న బెంగలో రైతులు కొట్టుమిట్టాడారు. తాజాగా కురిసిన వర్షాలు రైతుల బెంగను పూర్తిగా తీర్చేశాయి. దీంతో ట్రాక్టర్లతో దమ్ముపట్టి, కూలీలతో నాట్లు వేయించే పనిలో బిజీ అయ్యారు. అంతా ఒకేసారి నాట్లుకు సిద్ధం కావడంతో కూలీల కొరత వేధిస్తోందని రైతులు చెప్తున్నారు.

తుమ్మపాల: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరింది. దీంతో రైతుల్లో ఆనందం హెచ్చింది. వాగులు, వంకల్లో ప్రవాహాలు పెరిగాయి. చెరువులు నిండుకుండల్లా మారాయి. దీంతో రైతులు ముమ్మరంగా దమ్ములు పట్టి, వరినాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో తొలకరిలో వేసిన వరి నారు కొన్ని చోట్ల ఎండిపోయింది. మిగిలిన ప్రాంతాల్లో రైతులు కాపాడుకుంటూ వచ్చారు. మొదట్లో చిటపట చినుకులతో మొదలైన వర్షం ఇటీవల వారం రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురవడంతో పుష్కలంగా నీరు చేరింది. దీంతో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేసే పనిలోపడ్డారు.

వేధిస్తున్న కూలీల కొరత

తాజా వర్షాలతో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉడుపులు ఒకేసారి మొదలయ్యాయి. దీంతో కూలీల కొరత ఏర్పడింది. వర్షానికి పొలాల్లో నీరు చేరినప్పటికి గత రెండు రోజులుగా ఎండలు బాగా పెరగడంతో ఉడుపులు చేసేందుకు రైతులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండలు పెరిగే కొద్దీ పంట పొలాల్లో నీరు ఆరిపోతుందన్న భయంతో అంతా ఒకసారి ఉద్యుక్తులయ్యారు. దీంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. సాధారణంగా రూ.150 నుంచి రూ.200 వరకు ఉండే రోజు కూలీ, ఇపుడు రూ.300కు పెరిగింది. అయినప్పటికీ కూలీలు దొరకట్లేదని రైతులు వాపోతున్నారు. దమ్ము పట్టేందుకు ట్రాక్టర్లున్నప్పటికీ, నాట్లు వేసేందుకే ఇబ్బంది నెలకొందని చెప్తున్నారు. వీలైనంత వేగంగా నాట్లు వేసేయాలని పేర్కొంటున్నారు.

మండలంలో 7,300 ఎకరాల్లో వరి

మండలంలో 32 గ్రామ పంచాయతీలున్నాయి. కొత్తూరు మినహా అన్ని గ్రామాల్లోనూ వరి సాగు జరుగుతోంది. వరి ప్రధాన పంటగా దాదాపు 7,300 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మండలంలో మొత్తం సాగు విస్తీర్ణం 11,750 ఎకరాలు. వరి నాట్లు గతంతో పోల్చితే ఈ ఏడాది ఆలస్యమయ్యాయి. నారు ఎండిపోతుందన్న బెంగలో ఉన్న రైతుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ఆశలు చిగురించాయి. ఆగస్టు చివరి నాటికి కేవలం 1,600 ఎకరాల్లోనే వరినాట్లు పూర్తయ్యాయి. మిగిలిన విస్తీర్ణంలో నీటి కొరత కారణంగా వరినాట్లు చేయలేక ఆశలు వదులుకున్న రైతులకు ఇటీవల వర్షాలు ఆనందాన్నిచ్చాయి. దీంతో వరి నాట్లు వేసేందుకు రైతులు తలమునకలై ఉన్నారు.



వరి నారు తీస్తున్న రైతులు

దమ్ములు పట్టి.. ఉడుపులు చేస్తున్నాం



ఈ ఏడాది వర్షాలు ఆలస్యమవడంతో వరి పొలాల్లో నీరు లేక నాట్లు ఆలస్యంగా వేయాల్సి వచ్చింది. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరడంతో, దమ్ములు పట్టాం. నారుమడుల్లో వరినార్లు తీసి, ఉడుపులు మొదలుపెట్టాం. రైతులంతా ఒకేసారి ఉడుపులు చేయడంతో కూలీల కొరత ఉంది.

–ఎస్.కన్నయ్య, రైతు, వెంకుపాలెం

ముమ్మరంగా వరి నాట్లు



మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ముమ్మరంగా వరినాట్లు జరుగుతున్నాయి. వర్షాలు ఆలస్యంగానైనా కురవడంతో, పుష్కలంగా నీరు చేరింది. దీంతో రైతులు దమ్ములు చేసి, వరి నారు ఉడుపుల్లో నిమగ్నమయ్యారు. రైతులకు అన్ని విధాలా సలహాలు, సూచనలిస్తున్నాం.అన్ని ఆర్బీకేల్లో ఎరువులు సిద్ధంగా ఉంచాం.

–పీయూటీపీ రంగాచారి,
మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మండల సమావేశంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్: గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతానికి మండల సమావేశాలు ఉపయోగపడతాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశమందిరంలో అనకాపల్లి మండల సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ప్రధాన సమస్యలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. శాఖల వారీగా సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమాధానమిచ్చారు.

ముఖ్యంగా అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని నిరుపయోగంగా ఉన్న కొత్తూరు ఆర్బీకే భవనంలోకి తరలించాలని, మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు యూనిఫాం, షూ ఉచితంగా అందించాలన్న నిర్ణయాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. తుమ్మపాల ఆస్పత్రిలో రాత్రి వేళల్లో వైద్య సేవలు సక్రమంగా అందడంలేదన్న ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు ప్రశ్నకు వైద్యాధికారి షమీమ్ సిబ్బంది కొరత ఉందని సమాధానమిచ్చారు. విశాఖ కేజీహెచ్‌కు డెప్యుటేషన్‌పై వెళ్లిన స్టాఫ్ నర్సును ఇక్కడకు రప్పిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. తుమ్మపాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుపై ఎంపీటీసీ కన్నారావు అడిగారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లి కళాశాల ఏర్పాటయ్యేలా చూస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. మండలంలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల నియామకాన్ని చేపట్టాలని బవులువాడ ఎంపీటీసీ టి.విజయ దుర్గారావు కోరారు. మండలంలో క్వారీల నిర్వహణలో యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, రాత్రి వేళల్లో బ్లాస్టింగ్‌లు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని సభ్యులు గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడును ప్రశ్నించారు. దీనికి ఏడీ సమాధానమిస్తూ తమ శాఖ కేవలం రాయల్టీ సక్రమంగా చెల్లిస్తున్నారో లేదో చూస్తుందని, కాలుష్య నియంత్రణ బోర్డు, రెవెన్యూ, పోలీసు తదితర శాఖలు ఇచ్చే అనుమతుల గురించి తనకు తెలియదన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో వరి సాగు విస్తీర్ణం తగ్గిందని ఏవో రంగాచారి తెలిపారు. తుమ్మపాలలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎంపీటీసీ కన్నారావు కోరారు. మూడు, నాలుగు రోజుల్లో ఎరువుల స్టాకు వస్తుందని ఏవో తెలిపారు. రైతులంతా ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకునేలా సర్పంచులు, ఎంపీటీసీలు సహకరించాల్సిందిగా కోరారు. ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు మండల పరిధిలోని పాఠశాలల్లో మొదటి, రెండో దశల నాడు-నేడు పనుల వివరాలను తెలిపారు. కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించాలని సర్పంచ్ ప్రసన్నలక్ష్మి కోరారు. స్థలం చూపితే భవన నిర్మాణానికి అవసరమైన మొత్తాన్ని వీలైనంత వేగంగా మండల పరిషత్ నిధుల నుంచి కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీపీ తెలిపారు. సమావేశంలో ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకుమారి, ఐతా ఆనంద్‌రామ్, ఎంపీడీవో కేవీ నరసింహారావు, పంచాయతీరాజ్ డీఈఈ జె.వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి



శిక్షణ పొందిన మహిళలతో డాక్టర్ శశిధర్, వైశ్యరాజు కృష్ణరాజు

అనకాపల్లిటౌన్: మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు నైపుణ్య శిక్షన కార్యక్రమాలు దోహదపడతాయని ప్రముఖ హోమియో వైద్యనిపుణులు డాక్టర్ బి.శశిధర్ అన్నారు. స్థానిక గాంధీనగరం శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ మొదటి, రెండవ బ్యాచ్‌ల శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థల కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్ని, ప్రశాంతతని కలిగిస్తుందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో మహిళలకు వివిధ నైపుణ్యాల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన మహిళలు వారిళ్ల వద్దే ఖాళీ సమయాన్ని సద్వినియోగపరచుకుని, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణరాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జిలు అన్నం రాజశేఖర్, ఎస్.ఎన్.లక్ష్మణరావు, కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవతో అందరికీ ఆరోగ్యం



మాట్లాడుతున్న వైద్యాధికారి రమేష్

కశింకోట: ఆయుష్మాన్ భవ కార్యక్రమం ద్వారా అన్ని వ్యాధులకు దేశ వ్యాప్తంగా ఉచిత వైద్య సేవలు లభించనున్నట్లు తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ అన్నారు. దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని తాళ్లపాలెం పీహెచ్‌సీలో ఎంపీపీ కలగా లక్ష్మి బుధవారం ప్రారంభించారు. వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఢిల్లీ నుంచి ఆయుష్మాన్ భవ ప్రారంభోత్సవ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని ల్యాప్‌టాప్‌లో చూపారు. వైఎస్సార్ సీపీ సచివాలయ మండల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకురాలు ఆర్.వెంకటలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త ఆర్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి



రామ్‌మోహనరావును సత్కరిస్తున్న భారత వికాస్ పరిషత్ సభ్యులు

అనకాపల్లిటౌన్: తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగు భాష పరిరక్షణ సమితి కన్వీనర్ కోయిలాడ రామ్‌మోహనరావు అన్నారు. స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో భారత వికాస్ పరిషత్ అనకాపల్లిశాఖ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి తెలుగు వెలుగు కార్యక్రమంలో భాగంగా అనేక చోట్ల రామాయణం, మహాభారతంలోని ఘట్టాలపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ దేశాల్లో తెలుగు భాషకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అలాంటి తెలుగు భాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం భారత్ వికాస్ పరిషత్ సభ్యులు రామ్‌మోహన్ రావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్, కార్యదర్శి ఎస్ఏబీ వర్మ, కోశాధికారి డి.శివరామ్, సభ్యులు పి.నిర్మల, ఎస్.గోపాలరావు, వి.ఈశ్వరరావు, కె.వి.గౌరీపతి, ఏవీ బ్రహ్మానందం, ఎస్.నూకరాజు పాల్గొన్నారు.

శరవేగంగా సామాజిక భవన నిర్మాణం

కశింకోట: కశింకోటలోని గవరపేట కళ్లాల దిబ్బ వద్ద రూ.8 లక్షలతో సామాజిక భవనాన్ని నిర్మిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు బుధవారం తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమకూర్చిన నిధులతో దీని నిర్మాణం చేపట్టామన్నారు. నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే వినాయక చవితిలోగా దీన్ని పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



వెదురుపర్తిలో మట్టి గణపతిని పూజిద్దాం అంటూ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కశింకోట: మట్టి వినాయక విగ్రహాలను పూజించి కాలుష్య నివారణకు దోహదపడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వెదురుపర్తి హైస్కూల్ విద్యార్థులు బుధవారం పెద్ద ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో మట్టి వినాయక ప్రతిమలతో ప్రదర్శన చేశారు. రంగు వినాయక ప్రతిమలను పూజించి నదులు, కాలువలు, బావులలో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితం అవుతుందని, జల జీవరాశులకు హాని కలుగుతుందని, పంట భూముల సారం దెబ్బతింటుందని వివరించారు. ఈ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. పాఠశాలలో మట్టి వినాయకుడు-పర్యావరణ పరిరక్షకుడు అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీవీకే ఆచారి, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఏవీఎస్ మూర్తి, ప్రతినిధులు బోయిన చిన్నారావు, పీవీఎస్ఎన్ మూర్తి, సబిత లక్ష్మి, విజయలక్ష్మి, సత్యవాణి, సోమరాజు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ ధ్యేయం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్



గడప గడపకూ మంత్రి వెంట అడుగులేస్తున్న స్థానిక జనం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని పరవాడ పాలెం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఇప్పటికే పేదరికం చాలా వరకు తగ్గిందన్నారు. ఉపాధి కల్పనలో సీఎం జగన్ తీసుకుంటున్న చర్యలు అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే సంపూర్ణ సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. ప్రజాహితాన్ని కోరుకుంటున్న ఆయనను ముఖ్యమంత్రిగా అధికారంలోకి తీసుకు రావాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. సీఎం జగన్ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, విమర్శలు చేసినా ప్రజలు వారిని విశ్వసించడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందుకే ప్రజల వద్దకు ధైర్యంగా తాము వెళ్లగలుగుతున్నామని పేర్కొన్నారు. గత నాలుగున్నరేళ్లలో పల్లెలు ప్రగతి బాట పట్టాయన్నారు. పరవాడపాలెం గ్రామంలో త్వరలో పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న ఆలయాన్ని పరిశీలించారు. మహిళలు అడుగడుగునా పూల వర్షం కురిపించి, మంగళ హారతులు పట్టి మంత్రిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల పార్టీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, గొంతిన శివ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏకు ప్రభుత్వ గుర్తింపు పట్ల హర్షం



గ్యారేజీలో కార్మికులకు స్వీట్లు పంచుతున్న సుధాకర్

అనకాపల్లిటౌన్:ఆర్టీసీ కార్మికుల్ని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల భవిష్యత్తుకు భరోసానిచ్చిన ప్రభుత్వం నేడు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఏపీపీటీడీఎన్ఎంయూఏ)ను తొలి సారిగా ప్రభుత్వ గుర్తింపు సంఘంగా ప్రకటించడం ఆనందంగా ఉందని అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. స్థానిక గ్యారేజీలో బుధవారం కార్మికులకు మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీని ప్రజా రవాణా శాఖగా ప్రభుత్వంలో విలీనం చేసి, వేలాదిమంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని కొనియాడారు. గత ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పడమే తప్ప, అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. తాజాగా జీవో నెం.96 ద్వారా ఏపీ పీటీడీ ఎన్ఎంయూఏకు గుర్తింపునివ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పింఛన్లతో లబ్ధిదారుల్లో ఆనందం



ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పింఛన్లను అందిస్తున్న మందపాటి జానకీరామరాజు



కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లిటౌన్: సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యతనిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక 82వ వార్డు పరిధి మూడు, నాలుగు సచివాలయాల్లో 69 మందికి కొత్త పెన్షన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ జోనల్ పరిధిలో కొత్తగా 300 మందికి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసిందన్నారు. కొత్త పింఛన్లు అందుకున్న లబ్ధిదారుల ఆనందమే తమ ప్రభుత్వానికి ఆశీస్సులుగా భావిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన లబ్ధిదారులకు వలంటీర్ వ్యవస్థ ద్వారా సకాలంలో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు, మరింత అభివృద్ధిని కోరుకునే ప్రజలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరో సారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక దేవస్థానం సభ్యుడు ఆడారి శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పలకా సత్యనారాయణ, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎం.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వేగి త్రినాథ్, ఉగ్గిన అప్పారావు, డొంక సత్తిబాబు, పేలూరు కల్యాణ్, కోన ఉమ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో 13 మందికి కొత్త పింఛన్లు

అర్హతే కొలమానంగా భావించి సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో కొత్త పింఛన్లు మంజూరైన 13 మందికి బుధవారం నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా సాంకేతిక సమస్యలతో పింఛన్ అందనివారు ఉంటే తక్షణమే తమదృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి వాటిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వద్దకు తీసుకెళ్లి త్వరితగతిన పింఛన్ మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ మాధవనాయుడు, వలంటీర్ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో లలితా సహస్రనామ హోమం



హోమం చేస్తున్న ప్రధాన అర్చకుడు

అనకాపల్లి రూరల్: సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణ మాస కోటి కుంకుమార్చన ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం లలితా సహస్రనామ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ క్రతువును ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు, ప్రసన్న సీతారామాచార్యులు, శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీ, లక్కరాజ అప్పారావు, కమిటీ సభ్యులు పోతల రమణ, రాయపరెడ్డి రామచంద్రరావు, మళ్ల భోగలింగం తదితరులు పాల్గొన్నారు.